# మంచితనం

"సామీ!"

ఇంటి ముందు నిలుచుని కేకేశాడు వీరయ్య.

వీరయ్య కేక విని బయటికి వచ్చాడు రామలింగయ్య భుజంమీది కండువా సర్దుకుని "ఏరా? ఏం పని? నేను వూరికి పోతున్నా" అన్నాడతను.

వేసుకున్న జుబ్బా లోపలి జేబులోంచి డబ్బు తీసి వసారా అరుగుమీద పెట్టాడు వీరయ్య.

"డబ్బు తెచ్చినావా? ఎంతుంది? సమయానికి తెచ్చినావురా!" అని డబ్బందుకుని లెక్కపెట్టి "ఇన్నూరుందే" అన్నాడు మళ్లీ.

"అవును సామీ"

'ఊఁ ఎంతయుందో ఏమో? లెక్కచూస్తే కానీ తెలియదు. గుర్తు లేదు. అయినా ఎక్కడికి పోతుందిలే. నీవు జను యిచ్చినప్పుడల్లా లెక్కరాసి పెడుతూనే వున్నాను" అని "ఆఁ నాకు బస్సుకు టైమైతుందేమో వస్తాను" అన్నాడు రామలింగయ్య.

"ధర్మప్రభువులు, మీకాడ నా లెక్క యాడికి పోతుంది. బద్దరంగా దాస్తారని కదా యిస్తున్నాను" అన్నాడు వీరయ్య.

నవ్వాడు రామలింగయ్య ఆ మాటలకి. మీసాలు దువ్వుకుని "ఒరే వీరయ్యా! ఈసారి వచ్చినప్పుడు బాండు రాయించుకోరా. ఎందుకయినా మంచిది. తల్లయినా, పిల్లలయినా లెక్క లెక్కే! తర్వాత ఏ వ్యత్యాసం వచ్చినా నలుగురూ నన్నే అంటారు మాట పడటంకంటే మరణం మేలు అన్నారు. పెద్దలు, దమ్మిడీకి పోయిన మర్యాద తనువెత్తు ధనం ధారపోసినా రాదు" అన్నాడు మళ్లీ.

""సామీ! నా సిన్నప్పటి నుంచి మీ వుప్పు తింటుండాను. మీ కాలికింద బతుకుతున్నాను, మీ ఎంగిలి తిని, మీ చెమటమూసిన బట్ట కట్టుకున్నాను. నే నెంత? నా దాపరికం ఎంత? నా లెక్కంతా కలిసినా మీ చేలో నారుమడిలో పండిన ఒక కారు పంటంత కాదు. మీరు నన్ను మోసం చేస్తారా? అన్నాడు వీరయ్య.

"ఊ! ఊ! అసూత్రం నమ్మకం వుంటే చాలు బ్రతికిపోతాను. మరి నే వెళ్లివస్తాను" అని కదిలిపోయాడు రాములింగయ్య.

అంతలో అటుగా వచ్చింది జయమ్మ.

జయమ్మ భారీగా వుంది. మనిషి నడుస్తూ వుంటే గున్న ఏనుగులా వుంటుంది. ఆమె ముఖంలో పునిస్త్రీ కళ కాగడాపెట్టి వెతికినా కనిపించదు. పదహనాటి ముత్తయిదువులా వుంటుంది. ఆరుగురు పిల్లల తల్లియినా ఆమెకి అలంకరణలో యావచావలేదు. ఆ మాటకొస్తే ఆమెకు చావని యావలు చాలా వున్నాయి. ప్రతిరోజూ మట్కా ఆడుతుంది. ఓపెన్‌కి కొంత, క్లోజ్‌కి కొంత, బ్రాకెట్‌కి కొంత అని విడివిడిగ ఎలాట్ చేసుకుని డబ్బు కడుతూవుంటుంది. పర్స్ పైసా విదల్చడు.

అందుకని యింట్లో కొడుకులకీ కూతుళ్ళకి తెలియకుండా బియ్యమూ, కందిపప్పులు అమ్ముతూ వుంటుంది. అంతేకాకుండా అయిదారు నెలలు వాడిన చీరలూ రవికలూ నూర్‌మహమ్మద్‌కి సగం రేటుకి అమ్ముతుంది. ఈ డబ్బే ఆవిడకి అన్నిటికీ పెట్టుబడి.

"ఏరా వీరయ్యా! యెక్కడికి వచ్చావ్?" అని అడిగింది జయమ్మ.

"ఏం లేదమ్మా! అయ్యకు డబ్బిచ్చి వెడుతుండాను" అన్నాడు వీరయ్య.

ఈర్ష్యగా చూసింది జయమ్మ.

"నీదే అదృష్టం వీరయ్యా! ఒక కొడుకు మిల్లులో పనిచేస్తూ వాడి బ్రతుకు వాడు బ్రతుకుతున్నాడు కూతురూ భార్యా కూలీనాలీ చేసి సంపాదిస్తున్నారు. నీవు పొలాలు కౌలుకి తీసుకుని సంపాదిస్తున్నారు. మీకంతా ఆదాయమే" అంది.

నవ్వాడు వీరయ్య.

"కుంటను చూసి సముద్రం అసూయపడితే ఎట్లా అమ్మా" అన్నాడు.

"సరే! సరే! అని అటూ యిటూ చూసి "వీరయ్యా! బియ్యం కావాలంటె తీసుకపో...సంక్రాంతి వస్తుందికదా!" అంది.

"వద్దులే అమ్మా! పరిగ ఏరుకుని తెచ్చిన వడ్లున్నాయి. దంచుకుంటాం" అని "వస్తానమ్మా చేనితట్టు కెళ్ళాల" అని కదిలాడు.

"వీరయ్యా! కాసిన్ని కూరగాయలు పంపిస్తావా?" అంది ఆమె.

"అట్లాగే అమ్మా! మాపటియాళ తెస్తాను" అని వెళ్ళిపోయాడతను.

ఇంటికి వెళ్ళిన వీరయ్య తన పక్కింటివాళ్ళ గోడకు బొగ్గుముక్క తీసుకుని రెండు వందలు గుర్తు రాసుకున్నాడు. ఈ నాలుగయిదేళ్లలో అతను రాములింగయ్యకు యిచ్చిన డబ్బంతా యెప్పటికప్పుడు ఆ గోడమీద గుర్తు రాసుకుంటూ వస్తున్నాడు. ఒక్కసారి ఆ అంకెలనంక తృప్తిగా చూసి లెక్క పెట్టి "మూడువేల నాలుగొందల అరవై" అనుకున్నాడు.

ఆ మొత్తాన్ని చూశాక అతనిలో కొద్దిగా గర్వం తలెత్తింది.

✧ ✧ ✧

"సిన్నదానికి యాన్నైన సంబంధం చూపి ముడి పెట్టాల" అంది సుబ్బమ్మ వీరయ్య తల్లో పేలు కుక్కుతూ.

అదో రకమైన పారవశ్యంలో వున్న వీరయ్య "ఊఁ ఊఁ" అన్నాడు.

"అది ఎదిగి యాడదవుతోంది. మీ అక్క కొడుకు శేషయ్యని అడగరాదా?"

"వాడా? మనమాట యింటాడా అబ్బా సదువు కుంటున్నాడు కదా! సదువు కున్నపిల్లే కావాలంటాడేమో మరి"

"ఆఁ సంబడం! ఎనకా ముందర ఏమీ లేదు. సదువుకుంటే సాలా. వుజ్జోగం రావద్దా?"

"అడికేమే! షాద్రీనాస్తంగా వుంటాడు. ఆళ్ల దేశం ఎళదామా అని కూడా అడిగాడంట.

"అయితేనేం - మన గిరిజని చూస్తే కాదన బుద్ధి అవుతుందా?"

"సర్లే! సర్లే! రేపో ఎల్లుండో ఎళ్లొస్తా" అన్నాడు వీరయ్య ఆవలిస్తూ.

అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది.

✧ ✧ ✧

వీరయ్య పక్కింటి ఆసామీ పరంధామయ్య బాగా వున్న మోతుబరి రైతు. నలుగురు కొడుకుల తర్వాత అపురూపంగా పుట్టిన జయంతికి బాగా చదువుకుని కలెక్టరేట్లో పనిచేస్తున్న జయరామన్‌కి ఖాయం చేశాడు. పెళ్లి యింకో నెల రోజులుంది. భారీ ప్రయత్నాలు ప్రారంభించాడతను. ఇంటి ముందు పెద్ద వసారా వేయించాడు. వసారా ఓ వారన గది కట్టించాడు. మేడ వుంటేనే ఘరానాగా వుంటుందని అందరూ అంటే కాదనలేక పైన ఓ గది వేయించాడు.

ఇంటిముందు కాంపౌండ్ వాల్ కట్టించాడు. మంచి ఇనుపగేటు వేయించాడు. గేటునుంచి వసారా వరకు కొత్త మట్టి తోలించాడు. రకరకాల మొక్కలు నాటించాడు. మధ్య రోడ్డులాగ ఇసుక పోయించాడు. ఇంటికి నాలుగువేపులా వెల్లవేయించాడు.

ముందుభాగాన రంగులు వేయించాడు.

అలనాడు జానకీ పరిణయవేళ జనక మహారాజు పొంగి పోయినట్లుగా ఆనందంతో పొంగిపోయి అన్నీ తన ఘనతకి తగినట్లుగా చేస్తున్నాడు. ఊరందర్నీ పిలవాలనీ, పెళ్లినాటికి డాన్సర్‌ని పిలిచి బ్రహ్మాండంగా డాన్సులు చేయించాలనీ, రికార్డుల ధ్వనులతో ఆకాశం దద్దరిల్లి పోవాలని, ఎన్ని విధాల భారీపెళ్లి అనిపించాలో అలా చేయాలని ప్లాన్స్ వేయసాగాడు పరంధామయ్య.

✧ ✧ ✧

"ఏమయ్యో! నీకేం సీమ కుట్టినట్టుగా కూడా లేదే?" అంది సుబ్బమ్మ భర్తకి పళ్లెంలో అన్నం వడ్డిస్తూ.

వడ్డించిన అన్నాన్ని చింతకాయ పచ్చడితో కలుపుకంటూ "ఏందే? అని అడిగాడు వీరయ్య. .

"పరంధామయ్య బిడ్డ పెళ్లి సేస్తున్నాడు. జయంతమ్మ మన గిరిజ ఒకీడువాల్లే."

"కాన్లేయే! ఆళ్ళకూ మనకూ యాడకుదుర్తది." నోట్లో ముద్ద పెట్టుకుంటూ అన్నాడతను.

"ఏమే - మనకేం తక్కువే - మనకు తగింది మనం చేస్తాం. నా మాటిను. శేషయ్యను అడిగిరా."

"రేపు ఎల్తాలేయే" అన్నాడు వీరయ్య భోంచేస్తూ.

రెట్టించలేదు వీరయ్య భార్య.

✧ ✧ ✧

ఆ మరుసటిరోజు ఉదయమే లేచి ముఖం కడుక్కుని భార్య పెట్టిన సద్ది అన్నం తిని బయలుదేరాడు వీరయ్య. బస్సు దిగి, నడిచి వెళ్లి మధ్యాహ్నానికల్లా అక్కగారి వూరు చేరుకున్నాడు వీరయ్య. అతని అక్కయ్య వీరమ్మ తమ్ముడి రాకకు చాలా సంతోషించింది. ఆప్యాయంగా భోజనం పెట్టింది.

కుశలప్రశ్నలు వేస్తూ కబుర్లు చెపుతూ అన్ని విషయాలూ అడుగుతూ ప్రేమని వర్షించింది వీరమ్మ.

అక్కగారి ఆప్యాయతకి అనురాగానికీ మురిసిపోయాడు వీరయ్య. తప్పకుండా గిరిజని శేషయ్యకు చేసుకుంటుందని పొంగిపోయాడు.

అన్నాలు తిన్నాక ఆకూ వక్క పొగాకుకాడా యిచ్చి తమ్ముడి ప్రక్కనే కూర్చుంది వీరమ్మ.

ఆకు నములుతూ "అక్కా! పనిమీదొచ్చానే" అన్నాడు వీరయ్య.

"ఏందిరా ఆ పని?"

"గిరిజమ్మని నీ కోడల్ని సేసుకోయే" అన్నాడు వీరయ్య.

నవ్వింది వీరమ్మ "ఓరేయ్! అది పుట్టినాల్నుంచి నా కోడలనేకదరా అనుకుంది. ఈ యాల కొత్తగా అడుగుతావేందిరా?" అని అంది.

గుండెలపై బరువు దించినట్లయింది వీరయ్యకు.

"అక్కా! దాని పెళ్లికోసమని మూడేలకి పైన్నే దాశానే! అదంతా దానికే. నీయిష్టం ఖర్చు యెంతయినా పెట్టుకో. మిగిలింది శేషయ్యకే" అన్నాడు వీరయ్య.

"అప్పన్నా! యీరోజుల్లో అందరికీ ఆసె ఎక్కువైంది. కొడుకుల్ని గొడ్లని అమ్ముకున్నట్టు అమ్ముకుంటున్నారు. అయినా నాకు లెక్కెందుకురా? నీ అల్లుడికే యిచ్చుకో. ఆడిట్టం. నీయిట్టం. అంది వీరమ్మ.

"నే ఎల్లొస్తానే, ఊరికెల్లి మూర్తాలు పెట్టించి జాబు రాయిస్తా" అని లేచాడు వీరయ్య.

ఇంకా రెండురోజుండి పొమ్మని బలవంతం చేసింది వీరమ్మ. అయినా వీరయ్య వినకుండా వెళ్ళిపోయాడు.

✧ ✧ ✧

ఆరోజు ఉదయమే లేచి పశువులకి గడ్డి కోసుకుని రావటానికి పొలానికి వెళ్ళింది గిరిజ. చకచకా గడ్డి కోసుకుని మోపు కట్టుకుని తిరిగి యింటికి సద్దామనుకునే సమయానికి రామలింగయ్య కొడుకు ప్రభాకర్ ఆమెని చూసి అటుగా వచ్చాడు.

ప్రభాకర్ హైస్కూలు చదువుని దాటలేక ఆగిపోయి గ్రామ సర్వేచేస్తూ వుంటాడు. ఎప్పుడైనా గాలి మళ్ళితే అలా పొలాలవేపు వస్తాడు. అందునా అతని స్వార్ధమే వుంది.

"ఏమే గిరిజా! గడ్డికోసం వచ్చావా?" అని ప్రశ్నించాడతను.

తలూపింది గిరిజ.

"ఎక్కువగా కోసినట్టున్నావు. మోపు బరువుగా వుంటుందేమో? ఎత్తి పెట్టనా?" అని అడిగే డతను.

" ఒద్దులే బాబూ! ఎత్తుకోగలను" అందిగిరిజ.

"ఫరవాలేదులే మనలో మనకేమిటి. చేయి వేయనీ" అని ముందుకి వచ్చి మోపు ఎత్తబోయాడు. అతనికి కదల్లేదది. నవ్వింది గిరిజ.

కొద్దిగా అవమానం అయినట్లు ఫీలయ్యాడతను. "నీవూ చేయి చేయి కలిపితే కదా ఎత్తగలిగేది" అన్నాడు.

చేయివేసి ఎత్తింది గిరిజ.

ఆమె చేయి అతని చేయి కలిశాయి.

విద్యుత్ ప్రవహించినట్టుగా అయింది అతనికి. చేయి వదిలాడు, మోపు జారి పడింది. గిరిజ తూలింది ఆ వూపుకి "ఆఁఆఁ పడతావు" అని పట్టుకున్నాడు ప్రభాకర్.

నిలదొక్కుకున్న గిరిజ అతని పట్టు విడిపించుకోబోయింది. ప్రభాకర్ వదల్లేదు. "గిరిజా! నీవు చాలా అందంగా వుంటావే" అన్నాడు యింకా దగ్గరికి లాక్కుంటూ.

గిరిజకి గుండెలు దడదడలాడేయి.

ధైర్యాన్ని పుంజుకుంటూ అతన్ని విదిలించి కొట్టింది. తూలి పడ్డాడు ప్రభాకర్. గడ్డి సంగతి గాలి కొదిలేసి పరుగెత్త సాగింది గిరిజ. వెంటపడ్డ ప్రభాకర్‌కి గిరిజ చిక్కలేదు.

కాటునించి తప్పించుకున్న మనిషిని చూసి పొగరైన జాతి నాగుపాము చూసి పగబట్టినట్టుగా బుసకొట్టేడు ప్రభాకర్.

✧ ✧ ✧

అదే రోజు సాయంకాలం వూరి చివరినుంచి షికారు నుంచి తిరిగొస్తున్న ప్రభాకర్ కి వీరయ్య చిన్న కొడుకు రంగయ్య కనిపించాడు.

"రిక్షా" అని కేకేశాడు ప్రభాకర్.

రిక్షా ఆపలేదు రంగయ్య.

"ఒరే ఆపరా రిక్షా" అన్నాడు మళ్లీ.

అటూ యిటూ చూసి ఎవరూ లేరని నిశ్చయించుకొని "ఎందుకురా?" అన్నాడు తిరిగి రంగయ్య.

"ఒరే గాడిద కొడకా! నన్ను ఒరే అంటావా" మళ్లీ కోపంగా అరిచాడు ప్రభాకర్.

"ఏం నీకు కొమ్ములు మొలిచాయా ! గాడిద బుద్దులు నీవిరా" అన్నాడు రంగయ్య మళ్లీ.

కోపం ఆపుకోలేక రంగయ్య పైకి దూకేడు ప్రభాకర్. అంతే ! తర్వాత ఫటా! ఫట్! ధనా ధన్! గుద్దులు, రక్కు కోపటాలు, బాదు కోవటాలు. ఎవరు ఎవరిని కొడుతున్నారో తెలియనంత వేగంగా బాక్సింగ్ జరిగింది. పది నిమిషాలు గడిచేసరికి నీరసంగా పడిపోయాడు ప్రభాకర్. "హుఁ బుద్ది తెచ్చుకుని మర్యాదగా నడుచుకో, ఆడపిల్లల జోలికి మళ్లీ వెళ్లేవా యీసారి ప్రాణాలు తీస్తా" అని ఆయాసంగా రిక్షా తొక్కుకుంటూ వెళ్లిపోయాడు రంగయ్య.

అవమానంతో ఆక్రోశంతో బుసలు కొడుతున్న ప్రభాకర్ మరో గంటకి కానీ తేరుకుని యిల్లు చేరలేకపోయాడు.

కోపంతో, దుఃఖంతో ఆవేదనలో ప్రశ్నించిన తల్లికి కథంతా రిక్షా కట్టమంటే ఒరే అన్నానని పేచీ వేసుకుని పోట్లాడి కొట్టిపోయాడని చెప్పాడు ప్రభాకర్. జయమ్మ మనస్సు అగ్నిలో ఆజ్యం పోసినట్టుగా మండిపోయింది.

'భర్త రానీ వాడి బాబు సంగతి తేలుద్దాం' అనుకుంది ఆమె.

✧ ✧ ✧

పరంధామయ్య గారింట్లో మంగళవాద్యాలు మధుర మధురంగా మోగుతున్నాయ్. వియ్యాల వారికి విడిది చూపించి కాఫీ, టిఫిన్లు స్నానపానాదులకీ బేండుమేళంతో యింటికి తెస్తున్నాడు ఆయన. వీధి వీధంతా ఆ సంగీతంతో మార్మోగి పోతోంది.

"అయ్యగారూ! ఆ డబ్బు యిప్పిస్తారా" అడిగేడు వీరయ్య.

"ఏ డబ్బురా ?"

"అదేనయ్యా. మీకాడ దాసుకున్న లెక్క."

"నా వద్ద దాచుకున్నావా ? ఎంతరా ?"

"అదేమిటి సామీ! అట్టా అడుగుతున్నావ్. నీకాడ మూడువేల నాలుగొందల అరవై దాసుకున్నాను. నా బిడ్డ పెళ్లి రేపు. ఆ లెక్క తీసుకుని నేను మా అక్క వూరికి ఎళ్లాల. నీవు యిస్తే వెళ్లిపోతాను. ముందుగా సెప్పలేదనుకోండి. మీకేం మారాజులు ఎప్పుడడిగినా ఉంటాది లెమ్మని ముందు సెప్పలేదు."

నవ్వేడు రామలింగయ్య.

అటుగా వచ్చిన ఆ వూరి సర్పంచి వెంకటరెడ్డి వేపు చూసి "చూశావా అన్నా! వీడు ఎంత ఎత్తేశాడో! నా దగ్గర మూడువేల నాలుగొందల అరవై దాచుకున్నాడట. అది యీరోజు కావాలట. బిడ్డ పెళ్లికి కావాలట. మంచి ప్లానే" అని "ఒరే వీరయ్యా! నమ్మకస్తుడివి కదా అని పొలం కౌలుకిచ్చి, గింజాగ్రిటా సహాయం చేసినందుకు ఆఖరికి నాకే ఎసరు పెడుతున్నావా. బావుందిరా బావుంది. ఇలాగయితే మీలాటివాళ్లు కాపురాలు చేసినట్లే" అన్నాడు. ఆయన ముఖంలో కోపం లేదు. ప్రశాంతంగానే అన్నాడిదంతా.

నిర్ఘాంతపోయాడు వీరయ్య. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్ "సామీ! నన్ను ఇప్పుడు అన్నాయం చేయకండి. బిడ్డ పెళ్లి పెట్టుకున్నాను. ధర్మప్రభులని తమకాడ దాసుకున్నాను. ఈనాడు యిట్టా అంటే నాకు సావే గతి."

"బావుందిరా వ్యవహారం ! ఆయనవద్ద దాచుకోలేదంటే అలా మొండిగా ప్రాధేయపడతావేం? దాచుకున్నట్టు ఏదైనా గుర్తుందా?"

"రెడ్డీ! మాలాటోళ్ళకి సాచ్చికాలా ? ఆయనే గుర్తు రాసిత్తానంటే వద్దన్నాను. కంచే నేను మేస్తంటే కాదనేవాళ్ళు ఎవరు. సామీ! నా బతుకంతా నీకాడ ఎల్లమారిపోయింది. ఇంత తిండి పెట్టి గుడ్డ యిచ్చినావు. ఇప్పుడు నా చావుకూ నీవే కారనం అయితావు" అన్నాడు వీరయ్య.

కోపంగా మాసి "ఒరే వీరయ్యా! మంచికి పోతే చెడు ఎదురైందిరా. ఇదంతా నా మంచి తెచ్చిన తంటా. నేనూ అందరిలాగా ఉంటే యీనాడు నాకీ నింద వచ్చేది కాదు. వెళ్ళు వెళ్ళు. ఇక చాలు నీ నేస్తం. నాకు బాగా బుద్ధి వచ్చింది. ఎక్కడుంచాల్సిన వాళ్ళని అక్కడే ఉంచాలి" అన్నాడు రామలింగయ్య.

గోడు గోడున ఏడ్చి గుండె బాదుకుంటూ ఏదో చెప్పబోతున్న వీరయ్యని కసిరి అన్నాడు సర్పంచ్.

"ఇదిగో వీరయ్యా! మాటలతో ఏడ్పులతో లాభం లేదు. ఆయన దగ్గర దాచుకున్నట్టు ఏదైనా సాక్ష్యమో గుర్తు ఉంటే చూపించు. నేను నమ్ముతాను. నలుగురూ నమ్ముతారు. నిజమో

అబద్ధమో భగవంతుడికి తెలుసు. అయినా ఆయనతో సామ్మిప్పిస్తాను."

వీరయ్య మెదడులో ఏదో మెరుపు మెరిసింది.

"అయ్యా! నాకిప్పుడు గుర్తుకొస్తుంది. ఈయనకి లెక్కచ్చినప్పుడల్లా మా యింటికాడ పరంధామయ్యగారి గోడకు లెక్క రాసుకున్నాను. రండి సూపిత్తాను." అన్నాడు మెరిసే కళ్లతో.

క్షణకాలం రామలింగయ్య ముఖంలో బూచులు తారట్లాడాయి. కానీ ఏదో గుర్తుకొచ్చి ముఖం వికసించింది. వీరయ్య వెంట కదలివెళ్లారు యిద్దరూ.

పరంధామయ్య యింటి ముందు అభేరి రాగంలో "సమయానికి తగు మాటలాడి" అన్న త్యాగరాజస్వామి కీర్తన చెరిగిపోస్తున్నాడు దక్షిణాదిన సన్నాయి నేర్చుకుని వచ్చిన వేణుగోపాల్.

సంగీతానికి పరవశించిపోతూ ఆ యిల్లు దాటి - పలుకరింపులకి నవ్వుతూ యిద్దరూ వీరయ్య యింటి వద్దకి నడిచేరు.

గుడిసె వెనుకవేపుకి వెళ్లి గోడవైపు చూసిన వీరయ్య పై ప్రాణాలు పైనే పోయాయి. తెల్లగా వెల్లవేసిన గోడలాగే అయింది అతని ముఖం. మానం ప్రాణం ఒకేసారి పోయాయి. నిలువునా విరుచుకుని పడిపోయాడతను.

ఎందుకిలా వీళ్లొచ్చారా అని అర్థంకాక వాళ్ల వెనుకే వచ్చిన వీరయ్య భార్య సుబ్బమ్మ భర్త అలా కట్టెలా విరుచుకుని పడిపోవటం చూసి గాబరాగా అక్కడికి పరుగెత్తి శవంగా మారిపోయిన అతన్ని చూసి గోలుగోలున ఏడ్వసాగింది.

నిర్ఘాంతపోయాడు రామలింగయ్య.

నిశ్చేష్టుడయ్యాడు వెంకటరెడ్డి.

ఈ గోలంతా వినిపించకుండా వేణుగోపాల్ సృష్టిస్తోన్న నాదస్వరం గాలితో పోటీపడి సంగీత లోకాన్ని సృష్టిస్తూంది.

● 25-2-77 ఆంధ్ర సచిత్ర వారపత్రిక ●